దాహం తీరేదెన్నడో..?

- నస్రుల్లాబాద్ గురుకులంలో తాగునీటి సమస్య
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


నస్రుల్లాబాద్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ క్యాన్లు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, సౌకర్యవంతమైన వసతి కల్పించాలడానికి ప్రతి నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. అయితే నస్రుల్లాబాద్‌లో ఏర్పాటు చేసిన గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గురుకులానికి శాశ్వత భవనం ఉన్నా.. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు.

వాటర్ క్యాన్లతో సరఫరా..

మండల కేంద్రంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో దాదాపు 600 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి రాత్రి పగలు తేడా లేకుండా నీటి అవసరం ఉన్నా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. స్థానికంగా ఉన్న సిబ్బంది మినరల్ వాటర్ డబ్బాలను తెప్పించి ఉపశమనం కల్పిస్తున్న కూడా అందరికి సరిపడటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజన సమయాల్లో వాటర్ బాయ్ వచ్చి నీరు అందిస్తేనే వారు తినే పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా ముందుగా తిన్న విద్యార్థులకు మాత్రమే నీరు అందుతోంది.

ప్యూరిఫయర్ ఉంటే..

పాఠశాలలో నీటి శుద్ధీకరణ యంత్రం ఏర్పాటు చేస్తే నిరంతరం మంచి నీటి సౌకర్యం కల్గుతుంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం సరఫరా చేస్తున్న వాటర్ క్యాన్లను ప్రతి బాటిల్‌కు రూ.10 చొప్పున వెచ్చిస్తున్నారు. పాఠశాల సిబ్బంది నీటి సరఫరాకు అయ్యే ఖర్చును విద్యార్థుల అల్పాహారం నుంచి కోత కోసి విద్యార్థుల దాహం తీరుస్తున్నట్లు సమాచారం. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు మంచి నీటి అవసరం తీర్చడానికి శాశ్వత పరిష్కారం కోసం ప్యూరిఫయర్ సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి..



హాస్టల్‌లో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. వార్డెన్ సార్ మినరల్ నీరు తెప్పిస్తున్నారు. కానీ డబ్బాలు ఖాళీ అయితే ఆటో వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థి తి ఉంటుంది. –సందీప్, విద్యార్థి

ముందుగా తిన్నవాళ్లకే నీళ్లు..

పాఠశాలలో మంచి నీటికోసం ప్యూరిఫయర్‌ను ఏర్పాటు చేయాలి. ముందుగా తిన్న వాళ్లకే నీరు అందుతోంది. వెనక వాళ్లకు ఇబ్బంది కల్గుతుంది. ఎండలకు నీరు గరం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలి –అన్వేష్, విద్యార్థి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



హాస్టల్‌లో ఉన్న నీటి సమస్య గురించి ఉన్నతాధికారులు, స్థానిక పాలకుల దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థుల సమస్యను పరిష్కరించి మంచి నీటిని అందించేలా కృషి చేస్తాం. –వెంకట నారాయణ, ప్రిన్సిపాల్

క్లుప్తంగా

నర్సరీల పరిశీలన



బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామంలోగల నర్సరీని గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం నర్సరీలో మొక్కల ఎదుగుదలకు తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రాజమణి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతిలను ఆదేశించారు. బీఆర్‌ఎస్ నాయకుల వెంకట్రాం రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): మండలంలోని కారేగాం గ్రామ పంచాయతీలోగల నర్సరీలను గురువారం పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ పరిశీలించారు. అనంతరం నర్సరీ నిర్వాహకులకు, కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ పన్నులు చెల్లించని వారు ఈనెల 30లోపు చెల్లించాలని పేర్కొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



రాజంపేట: మండల కేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'గడపగడపకు మేనిఫెస్టో' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 18న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ విచ్చేస్తున్న సందర్భంగా కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల అధ్యక్షులు యాదవరెడ్డి తెలిపారు. సీనియర్ నాయకులు వీరన్నపటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణ స్థలం పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో నిర్మించనున్న వంద పడకల ఆస్పత్రికి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం టీఎస్‌ఎంఎస్‌ఐడీ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే భూమిపూజ పనులు జరగనున్నాయని మున్సిపల్ చైర్మన్ అన్నారు. డీఈ సుధాకర్, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

పలు గ్రామాల్లో గ్రామసభలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లికలాన్, బెజుగం చెరువుతండా గ్రామాలలో గురువారం సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి పలు తీర్మానాలు చేశారు. అలాగే జీపీ లావాదేవీలను చదివి వినిపించారు. సర్పంచ్‌లు కుమార్, మంగ్లీ, పంచాయతీ కార్యదర్శులు వనజ, అనిత, ఉప సర్పంచ్ గోప్యా, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో మహాజన సభ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నస్రుల్లాబాద్ సొసైటీ అధ్వర్యంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సభలో కార్యదర్శి శ్రీనివాస్ గత ఆరు నెలల లావాదేవీలను సభ్యుల ముందు చదివి వినిపించారు. అంతే కాకుండా దీర్ఘకాలిక ఋణాలను సకాలంలో చెల్లించాలని తీర్మానించారు. సొసైటీ చైర్మన్ గంగారాం, వైస్ చైర్మన్ సుంచు నారాయణ, సభ్యులు ఉన్నారు.

ఇంటింటికీ తెలుగు దేశం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో గురువారం టీడీపీ నాయకులు 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ మండల నాయకుడు రాజు మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తెలుగు దేశం పార్టీతోనే అవినీతి రహిత పాలన సాధ్యం అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. నాయకులు మాజీ సర్పంచులు బద్ద లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ, నర్సారెడ్డి, నాయకులు మహేష్, తిరుమల కిషన్ పాల్గొన్నారు.

నర్సరీలను సక్రమంగా నిర్వహించాలి



గాంధారి(ఎల్లారెడ్డి): ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీలను సక్రమంగా నిర్వహించాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. గాంధారిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సాయన్న మాట్లాడుతూ.. నర్సరీల్లో ఇప్పటి నుంచే మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులకు కూలీల హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. ప్రతి కూలీకి రూ.257 కూలీ పడేలా పనులు చేయించాలని ఆదేశించారు. ఎంపీడీవో సతీష్, ఇన్‌చార్జ్ ఏపీవో హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు


మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): చేపల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి వెల్లడించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగంపేట, సదాశివనగర్ మండలాలను పైలెట్ గ్రామాలుగా తీసుకుని, చేపల పెంపకంపై స్వయం సహాయక సంఘాల కుటుంబ సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐదు బ్యాచ్‌లుగా చేసి బ్యాచ్‌కు 30మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఫార్మ్‌పాండ్స్ తవ్వకం, గేదెల కోసం షెడ్లు, వ్యవసాయ పంట చేనులకు వెళ్లే ఇంటర్నల్ మట్టి రోడ్లు, చేపల చెరువుల తవ్వకం, చేపడుతున్నట్లు తెలిపారు. చేపల చెరువులు తవ్వకునే వారు ఆయా గ్రామాల సంబంధిత సీసీలకు తెలియజేయాలన్నారు. ఏపీఎం శ్రీనివాస్, అఖిల్‌రెడ్డి, కృష్ణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండను మున్సిపాలిటీగా ప్రకటించాలి


విప్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దోమకొండ: దోమకొండ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ప్రకటించాలని జీపీ పాలకవర్గం, మండలంలోని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం తీర్మానం చేసి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. 2014లో సమగ్ర కుటుంబసర్వే ప్రకారం మండలకేంద్రంలో 15వేల పైచిలుకు జనాబా ఉందని, ప్రస్తుతం 20వేల పైచిలుకు జనాభ ఉంటుందని వారు అన్నారు. మున్సిపాలిటీగా మార్చడానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్‌ను కోరారు. సర్పంచ్ నల్లపు అంజలి, ఎంపీపీ కానుగంటి శారద, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూధన్‌రావ్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, డైరెక్టర్ ఆశంశేట్టి పోశయ్య, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ ఐరేని నర్సయ్య తదితరులు ఉన్నారు.

'ఉపాధి హామీ'ని సద్వినియోగం చేసుకోండి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాణి తెలిపారు. మండల కేంద్రం శివారులో గురువారం ఉపాధిహామీ పనులను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా రాణి మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 100 రోజుల ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ తిర్మల్ రెడ్డి, ఎంపీవో సూర్యకాంత్, కార్యదర్శి శ్రీను ఉన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామశివారులో చేపట్టిన ఉపాధి పనులను గురువారం ఎంపీడీవో రఘు పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేపట్టాలని ఆయన కూలీలకు సూచించారు. అనంతరం వదల్‌పర్తిలోని నర్సరీని పరిశీలించారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన



బాన్సువాడ టౌన్: పట్టణంలోని ఎల్లయ్య చెరువు వద్ద కొనసాగుతున్న సీసీ డ్రెయినేజీ పనులను గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. రూ.కోటి 66 లక్షల నిధులతో పనులు చేపడుతున్నారు. అలాగే నూతనంగా నిర్మించే దోబీఘట్ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. సంగమేశ్వర కాలనీ నాలుగవ రోడ్డు సమీపంలో రూ. 2 కోట్లతో దోబీఘట్‌ను నిర్మించనున్నారు. ఆర్డీవో రాజాగౌడ్, సహకార సంఘం అధ్యక్షులు కృష్ణరెడ్డి ఉన్నారు.

రుణమాఫీని అమలు చేయాలి



భిక్కనూరు: ప్రభుత్వం వెంటనే రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని భిక్కనూరు సింగిల్‌విండో పాలకవర్గం తీర్మానించింది. మండలకేంద్రంలో గురువారం విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సభ్యులు రుణమాఫీ పథకం అమలు చేయాలని, ప్రతి రైతుకు రూ.2లక్షల రుణాన్ని ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో విండో వైస్‌చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, సీఈవో నర్సింలు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఓ బాధిత కుటుంబానికి గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ పంపిణీ చేశారు. డీసీసీబీ డైరెక్టర్ కిష్టగౌడ్, ఉప సర్పంచ్ సిద్దగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల దోబీఘాట్ పరిశీలన

బాన్సువాడ టౌన్: రాజన్న సిరిసిల్లలో నూతనంగా నిర్మించిన దోబీఘాట్‌ను గురువారం బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ రమేష్ పరిశీలించారు. బాన్సువాడలోని వీక్లీ మార్కెట్‌లో దోబీఘాట్‌ను నిర్మించేందుకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ. 2కోట్ల నిధులు మంజురు చేశారని, దోబీఘాట్ నిర్మాణం గురించి తెలుసుకునేందుకు సిరిసిల్లకు వచ్చామని వారు తెలిపారు.

సామూహిక సీమంతాలు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఆరేడ్ గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారికి పండ్లు, పూలు, స్వీట్లు, నూతన వస్త్రాలను అందజేశారు.

సమాచారం..

■ **18న పొద్దు పొడుపు సూరీడు పుస్తకావిష్కరణ**

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక (తెరవే) సమన్వయకర్త, కవి, రచయిత ఎనిశెట్టి గంగాప్రసాద్ రాసిన 'పొద్దు పొడుపు సూరీడు' పుస్తకావిష్కరణ ఈనెల 18న కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించనున్నట్లు తెరవే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గఫూర్ శిక్షక్, అల్లి మోహన్‌రాజ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు అవుతున్నారన్నారు.

■ **దరఖాస్తుల గడువు పెంపు**

బాన్సువాడ రూరల్: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువును ఈనెల 20వరకు పొడిగించారని కొయ్యగుట్ట సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యాసంవత్సరం 2023–24లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

అర్హులందరికీ డబుల్ ఇళ్లను అందించాలి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు.. ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కామారెడ్డి టౌన్: అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇవ్వాలని బీఎల్‌టీయూ, బీఎల్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్‌టీయూ రాష్ట్ర నాయకుడు ముద్రకోల ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈనెల 14న మున్సిపల్ పరిధిలో జరిగిన డ్రా పద్ధతిలో అవకతవకలు జరిగాయన్నారు. అర్హులైన వారికి కాకుండా ఇళ్లు ఉన్న వారికి ఇళ్లను కేటాయించారన్నారు. జిల్లా కార్యదర్శి కమ్మరి సదానందం, పట్టణ అధ్యక్షుడు వడ్ల సాయికృష్ణ, నాయకులు స్వామి, గంగమణి, లక్ష్మి, కిష్టమ్మ, రాజమణిఉన్నారు.

ఎల్లారెడ్డి మండలంలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): డబుల్ బెడ్‌రూం ఇళ్లలను అర్హులందరికి అందించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిలో గురువారం ఆయన డబుల్ బెడ్‌రూం ఇళ్ల బాధితులతో మాట్లాడారు. దరఖాస్తులు చేసుకున్న పేదలందరికీ డబుల్‌బెడ్ రూంలను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. బాధితులు ఆందోళన చేస్తే వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు అఫీజ్, శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్ తదితరులు ఉన్నారు.

అరెస్టులు సరికాదు..

ఎల్లారెడ్డి: డబుల్ బెడ్‌రూం ఇళ్లలను అడిగితే అరెస్టులు చేస్తారా? అని తెలంగాణ జన సమితి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నిజ్జన రమేష్ అన్నారు. ఎల్లారెడ్డిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం బాధితులు ఆందోళన చేస్తే, అరెస్టు చేయడం సరికాదని అన్నారు. అర్హులైన వారందరికి డబుల్ బెడ్ రూంలను కేటాయించాలని ఆయన కోరారు.

టీఎస్పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి


టీఎస్పీఎస్సీ చైర్మన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీవీఎం నాయకులు

కామారెడ్డి టౌన్: టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలపై బాధ్యత వహిస్తూ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా (బీవీఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట జనార్ధన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీలపై సీబీసీఐడితో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నిరు ద్యోగుల జీవితాలతో ప్రభుత్వ చెలగాటం ఆడుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, నాయకులు అర్బాస్‌ఖాన్, యోగేష్, రాహుల్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి


మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల పెండింగ్ ఆర్థిక బిల్లులను వెంటనే చెల్లించాలని, నిధుల మంజూరు కోసం ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రెజరరీలో పాస్ కాబడి ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఆర్థిక బిల్లుల నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో ఈ నెల 19న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న హాత్ సే హాత్ జోడో పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఒడ్డెపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. మండలంలో గురువారం ఆయన పర్యటించారు. మండల కేంద్రంలోని లక్ష్మమ్మ ఆలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి, యాత్రపై సూచనలు చేశారు. 18న రేవంత్‌రెడ్డి మండలంలోని గుడిమేట్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి చేరుకుంటారని, రాత్రి అక్కడే బస చేసి ఆదివారం ఉదయం సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్‌ను సందర్శిస్తారన్నారు. అనంతరం మండల కేంద్రం మీదుగ హాత్ సే జోడో పాదయాత్ర కొనసాగుతుందన్నారు.

'సెకండియర్' పరీక్షలు ప్రారంభం

పిట్లం/ఎల్లారెడ్డిరూరల్/తాడ్వాయి/నాగిరెడ్డిపేట/లింగంపేట: జిల్లాలో గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పలు మండలాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. పరీక్ష కేంద్రాల్లో సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరం పరీక్ష గదిలోకి అనుమతించారు. పిట్లం జూనియర్ కళాశాలలో 230 మంది విద్యార్థులకు గాను 224 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఎల్లారెడ్డిలోని మోడల్ కళాశాలలో 235 మందికి గాను ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు కాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 278 మందికి గాను నలుగురు గైర్హాజరు అయినట్లు కళాశాలల నిర్వాహకులు తెలిపారు. తాడ్వాయిలో 174మంది విద్యార్థులకు గాను 173మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 285 మంది విద్యార్థులు ఉండగా 280 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

ఆధ్యాత్మికం..

■ **ఘనంగా బోనాల పండుగ**



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్ నగర్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, అనంతరం అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

■ **ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి**



నిజాంసాగర్(జుక్కల్): దైవ కార్యక్రమాలతోపాటు ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని నిజామాబాద్ లింగేశ్వర గుట్ట బాలయోగి కృష్ణమహారాజ్ స్వామీజీ అన్నారు. మండలంలోని గున్కుల్ గ్రామ శివారులోని నిత్యసుమంగళిమాత ఆశ్రమాన్ని గురువారం స్వామీజీ దర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలకు వెళ్లలేని వారు దేహాన్ని శుద్ధి చేసుకొని ధ్యానం చేస్తూ దైవ నామస్మరణ చేసుకోవాలన్నారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

దోమకొండ: మండలంలోని సీతారంపల్లిలో గురువారం సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ప్రారంభించారు. సర్పంచ్ జాలిగాం నాంపల్లి, ఉపసర్పంచ్ మమత, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో డ్రెయినేజీ పనులు..

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్‌లో గురువారం డ్రెయినేజీ నిర్మాణ పనులను ఉప సర్పంచ్ మల్లేష్ ప్రారంభించారు. గజ్యానాయక్ తండా సర్పంచ్ హంజి నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంపిణీ

దోమకొండ: మండలంలోని సీతారాంపల్లి గ్రామంలో గురువారం జాతీయ ఆహర భద్రత పథకం కింద వచ్చిన కందులు, పెసర్లు, మినుములను గ్రామస్తులకు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఏడీఏ అపర్ణ,ఏవో పవన్ ఉన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సోమారం గ్రామంలో ఏడు రోజుల క్రితం ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ క్యాంపు గురువారం ముగిసింది. కామారెడ్డికి చెందిన ఎస్ఆర్‌కె డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు క్యాంప్‌లో భాగంగా ప్రజలకు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో శ్రమదానం నిర్వహించారు.

విద్యార్థులకు వనదర్శిని

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆటవీశాఖ ఆధ్వర్యంలో వనదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శేఖాపూర్ ఆటవీ ప్రాంతానికి విద్యార్థులను తీసుకెళ్లామని ఉపాధ్యాయులు తెలిపారు. ఆటవీశాఖ రేంజ్ అధికారి రమేశ్ మాట్లాడుతూ.. అడవుల వల్ల లాభాలు, అటవీ రక్షణ, జంతువుల రక్షణపై విద్యార్థులకు వివరించారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్టు

కామారెడ్డి టౌన్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీ నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో నాయకులు సురేష్, దినేష్, వినయ్‌లు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్‌అసిస్టెంట్ మృతి

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్ వంక అంజనేయులు (28) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లి చికిత్సచేయించుకుని గ్రామానికి తిరిగి వచ్చారు. గురువారం ఉదయం ఇంటిలోనే మృతి చెందాడు.

ఉత్తమ రిసెప్షనిస్టుగా స్వప్నకు పురస్కారం

మద్నూర్(జుక్కల్): మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తున్న స్వప్న రాష్ట్రస్థాయిలో ఉత్తమ రిసెప్షనిస్టుగా మొదటి స్థానంలో నిలిచారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులను మర్యాదపూర్వకంగా, స్నేహంగా పలకరించిన పనితీరుతో మొదటి స్థానం లభించిందని ఆమె అన్నారు. దీంతో ఆమెను పోలీసు సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని చీనూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం గ్రామానికి చెందిన మెరిగే రమేష్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు ప్లేట్లను వితరణ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.